చిరు వ్యాపారులకు రుణాలు

యూసీడీ విభాగం కసరత్తు ● ఇప్పటి వరకు 2,486 మందికి మంజూరు

ఖైరతాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్(యూసీడీ) విభాగం అధికారులు చిరు వ్యాపారులకు ప్రధానమంత్రి స్వనిధి పథకం కింద బ్యాంక్‌ల నుంచి రుణాలు ఇప్పిస్తున్నారు. మొదట రూ.15 వేలు, రెండోసారి రూ.25 వేలు, మూడోసారి రూ. 50 వేలు అందజేస్తూ వారికి చేదోడుగా నిలుస్తున్నారు.

ఇప్పటి వరకు 2,486 మందికి..

ఖైరతాబాద్ సర్కిల్-17లో చిరు వ్యాపారులుగా ఇప్పటి వరకు 5,624 మందిని అధికారులు గుర్తించారు. ఇందులో రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న 4,536 మందిలో ఇప్పటి వరకు 2,486 మందికి రుణాలు అందజేశారు. సమయానుకూలంగా చెల్లించిన వారికి ముద్ర, సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రామ్‌ల కింద రుణాలు మంజూరు చేయాలని అధికారులు బ్యాంకర్లకు ప్రతిపాదిస్తున్నారు. అతి తక్కువ వడ్డీతో రుణాలివ్వడమే కాక ఈ పథకంలో వడ్డీపై 7 శాతం రాయితీని సైతం అందిస్తుండడంతో స్వనిధి రుణాలకు ఆదరణ పెరుగుతూ వస్తోంది. ఎలాంటి ప్రాసెసింగ్ ఫీజు లేకుండా సులభ వాయిదాలతో 12 నుంచి 36 నెలల వ్యవధిలో చెల్లించేలా అవకాశాలు ఇస్తున్నాయి బ్యాంక్‌లు.

చిరు వ్యాపారులు పేర్లు నమోదు చేసుకోవాలి



సర్కిల్ పరిధిలోని ఖైరతాబాద్, సోమాజిగూడ, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్లలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకునేవారు, ఇంటింటికీ తిరుగుతూ వస్తువులు అమ్ముకునే వారు, ఇళ్లలో ఉంటూ పలు రకాల సేవలందించే వాళ్లు చిరు వ్యాపారులుగా నమోదు చేసుకొని వీధి వ్యాపారులుగా గుర్తింపు కార్డులు పొందాలి. భవిష్యత్తులో వీధి వ్యాపారులకు జీహెచ్ఎంసీ ద్వారా వెండింగ్ జోన్ ఏర్పాటు చేసే ఆలోచన ఉంది. మా రిసోర్స్ పర్సన్లు(ఆర్‌పీ)లు సైతం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వీధివ్యాపారుల పేర్లు నమోదు చేస్తున్నారు. పీఎం స్వనిధి పథకం కింద చిరువ్యాపారులకు తక్కువ వడ్డీతో రుణాలిస్తున్నారు. అందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

శ్రీనివాస్, ఉప కమిషనర్



డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీఖాన్‌ను ఆహ్వానిస్తున్న కార్తీక్ మహేశ్వరం

'తెలంగాణ కనెక్ట్స్ 2025' బిజినెస్ సమ్మిట్

● డిసెంబరు 6న అట్లాంటాలో..

బంజారాహిల్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(టీఈసీసీఐ) ఆధ్వర్యంలో అమెరికా అట్లాంటాలో డిసెంబరు 6న 'తెలంగాణ కనెక్ట్స్ 2025' బిజినెస్ సమ్మిట్ జరగనుంది. ఈ కార్యక్రమానికి కజకిస్తాన్ గౌరవ కాన్సుల్ డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ గౌరవ అతిథిగా హాజరవుతున్నారు. సోమవారం జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్.36లో టీఈసీసీఐ అధ్యక్షుడు కార్తీక్ మహేశ్వరం ఆయనను కలిసి ఆహ్వానం అందజేశారు. అనంతరం డాక్టర్ నాసిర్ అలీ ఖాన్ మాట్లాడుతూ తెలంగాణ పెట్టుబడిదారులకు అనుకూల ప్రాంతంగా అవతరించిందని, అట్లాంట సమ్మిట్ ద్వారా రాష్ట్రం పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం దక్కుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.



సువర్ణను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న డా.నీలిమ, విశాల్ సుధాం

బీఆర్ఎస్ మహిళా నేత కాంగ్రెస్‌లో చేరిక

బేగంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బేగంపేట డివిజన్‌లోని బ్రాహ్మణవాడికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ మహిళా నేత సువర్ణ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం అమీర్‌పేటలోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ సనత్‌నగర్ ఇన్‌చార్జి డా.కోట నీలిమ, నాయకుడు విశాల్ సుధాం ఆమెను పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల బస్సులు, ఆటోడ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

● ఖైరతాబాద్, ఆంధ్రజ్యోతి

చార్మినార్ వద్ద పారిశుధ్యానికి ప్రాధాన్యం

● జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

చార్మినార్ నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిత్యం అందుబాటులో ఉంటూ పారిశుధ్యం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం చార్మినార్, సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. చారిత్రాత్మక చార్మినార్ కట్టడం పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై అడిగి తెలుసుకొన్నారు. లాడ్‌బజార్ ముర్గిచౌక్ అభివృద్ధి నిర్మాణ పనులను పరిశీలించారు. చార్మినార్ కట్టడాన్ని వీక్షించేందుకు వచ్చే దేశ, విదేశాలకు చెందిన పర్యాటకులకు సమస్యలు తలెత్తకుండా పరిసరాలు శుభ్రంగా ఉండాలన్నారు. ఎలాంటి ఫిర్యాదులు రాకుండా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడూ క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట చార్మినార్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్లు సరిత, అరుణ, ఏఎంహెచ్‌ఓ డాక్టర్ చక్రపాణి, డాక్టర్ అన్నపూర్ణ, యూబీడీ చార్మినార్ జోన్ డిప్యూటీ డైరెక్టర్ విష్ణువర్ధన్, మేనేజర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రామోజీ ఫిల్మ్‌సిటీ పేరును 'రామోజీ చిత్రనగరి'గా మార్చాలి

● బీజేపీ రాష్ట్ర నేత శ్రీరాములు యాదవ్



శ్రీరాములు యాదవ్

సరూర్‌నగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్వతహాగా తెలుగు భాషాభిమాని అయిన దివంగత రామోజీరావు కలల సౌధం అయిన రామోజీ ఫిల్మ్‌సిటీ పేరును 'రామోజీ చిత్రనగరి'గా మార్చాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, పార్టీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్ రామోజీ కుటుంబ సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగు జాతి, తెలుగు భాష గౌరవాన్ని ప్రపంచ యవనికపై అగ్రగామిగా నిలిపిన మహా మనిషి రామోజీరావు అని, ఆయన పేరుపై ఉన్న స్టూడియోకు ఆంగ్లంలో పేరు ఉండడం సహేతుకంగా లేదని అన్నారు. తెలుగు భాషపై ఆయనకున్న మక్కువను పరిగణనలోకి తీసుకుని ఫిల్మ్‌సిటీ పేరును అచ్చమైన తెలుగులో 'రామోజీ చిత్రనగరి'గా మార్చి తెలుగు వారి హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోవాలని అందెల సూచించారు.

వెంటాడుతున్న వీధి కుక్కలు

● చిన్నపిల్లలు, వాహనదారులే లక్ష్యంగా దాడులు
● పట్టించుకోని జీహెచ్ఎంసీ అధికారులు



బ్రాహ్మణవాడి రహదారిలో వీధి కుక్కలు

బేగంపేట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలు గుంపుగా సంచరిస్తున్నాయి. చిన్నపిల్లలు, వాహనదారులను వెంటపడి కరుస్తున్నాయి. ఇదంతా తెలిసిన జీహెచ్ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదు. బేగంపేట డివిజన్‌లోని బ్రాహ్మణవాడి, ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ, వడ్డెర బస్తీ, మాతాజీనగర్ ప్రాంతాల్లో వీధి కుక్కల బెడద అధికంగా ఉంది. ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో ఇటీవల వీధి కుక్కల దాడిలో పలువురు చిన్నారులు గాయపడ్డారు. ప్రధానంగా ఒక పిల్లాడి తొడలు, చేతులపై కరవడంతో తీవ్ర గాయాలయ్యాడు. గీతాంజలి స్కూల్ సమీపంలోని బ్రిడ్జి కింద ఉన్న కుక్కలు బాటసారులను కరిచాయి. బ్రాహ్మణవాడి నుంచి మాతాజీనగర్ వరకు ఉన్న రహదారితో పాటు అంతర్గతంగా ఉన్న రోడ్లలో పెద్దసంఖ్యలో వీధి కుక్కలు ఉన్నాయి. చిన్నపిల్లలు రోడ్డుపైకి వస్తే వెంటనే దాడి చేస్తున్నాయి. నల్లపోచమ్మ ఆలయం వద్ద ఉన్న టిఫిన్ సెంటర్ వద్ద మిగిలిన ఆహార పదార్థాలు వదిలేయడంతో అక్కడ పదుల సంఖ్యలో చేరే కుక్కలు రహదారిలో రాక పోకలు సాగించే ద్విచక్ర వాహనదారులపై దాడులు చేస్తున్నాయి. రాత్రి అయితే ఈ దారిలో రావాలంటేనే పిల్లలు, మహిళలు భయాందోళనకు గురవుతున్నారు. జీహెచ్ఎంసీకి చెందిన కుక్కల వాహనం ఇటు వైపు వచ్చినా వీటిని పట్టుకోవడంలో విఫలమవుతున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు.

ఒక్క కుక్కను పట్టరు..

వీధుల్లో కుక్కలు ఉన్నాయని ప్రజలు జీహెచ్ఎంసీ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇస్తారు. నెలలో రెండు, మూడుసార్లు ఇటు వైపునకు వచ్చే కుక్కల వాహనం ఒక్క కుక్కను పట్టిన సందర్భం లేదని ఈ ప్రాంతానికి చెందిన విజయకుమార్ ఆరోపించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వీధికుక్కల బెడద నుంచి స్థానికులను రక్షించాలని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పుట్టిన రోజు సందర్భంగా హనుమాన్ మందిరిలో జరిగిన పూజలో ఎమ్మెల్యే నవీన్ యాదవ్



మందులు అందజేస్తున్న చిన్న శ్రీశైలం యాదవ్

ఘనంగా ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు

యూసుఫ్‌గూడ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వల్లాల నవీన్ యాదవ్ పుట్టిన రోజు వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. సోమవారం పలు ఆలయాల్లో పూజలు చేశారు. కృష్ణానగర్ హనుమాన్ మందిర్‌లో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేసి కేక్ కట్ చేశారు. ఏఐసీసీ జాతీయ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.వి.రవి శేఖర్‌రెడ్డి ఎమ్మెల్యేకు శ్రీకృష్ణుడి ఫొటోను బహూకరించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీరెడ్డి, రాధిక, ఆదిలక్ష్మి, బంటి యాదవ్, నాగరాజు, భరత్ కుమార్, సాయి యాదవ్ పాల్గొన్నారు. యూసుఫ్‌గూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరంతోపాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన వారికి సినీనటులు సుమన్, చిన్న శ్రీశైలం యాదవ్ పండ్లు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు మామిడి భీమ్‌రెడ్డి, బి.సతీష్ రెడ్డి, సుజాత, ఆయుబ్‌ఖాన్, పురుషోత్తం పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నవీన్ యాదవ్‌కు జన్మదిన శుభాకాంక్షలు చెబుతున్న కాంగ్రెస్ పార్టీ నగర ప్రధాన కార్యదర్శి దూడల రవిగౌడ్, నాయకుడు నరేష్ తదితరులు

బోరబండలో..

బోరబండ/ఎర్రగడ్డ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): బోరబండ బస్టాప్, సైట్-4,5లో కార్పొరేటర్ ఎం.డి.బాబాఫసియుద్దీన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేశారు. పార్టీ బోరబండ డివిజన్ అధ్యక్షుడు బి.అశోక్, జి.యాదయ్య, ఆనంద్, మొఘల్ ఎజాస్ బేగ్ పాల్గొన్నారు. బోరబండ ప్రాంతంలోని పలు చోట్ల మహిళా కాంగ్రెస్ నాయకురాలు హబీబా సుల్తానా కేక్ కట్ చేశారు. బోరబండ సాయిబాబానగర్‌లో సాయిబాబానగర్ యూత్, సంకల్ప ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదానం చేసిన యువకులకు బస్తీ అధ్యక్షుడు ఎం.రమేశ్ నాయక్ పండ్లు అందజేశారు. జీవోదయ అనాథాశ్రమంలో ఎర్రగడ్డ వార్డు కమిటీ సభ్యులు జి. రాము, కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయిరూపేష్, మెహతాబ్ ఖురేషి, శ్రీశైలం యాదవ్, మహ్మద్ ఆసిఫ్, జావిద్ పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఓల్డ్‌సుల్తాన్‌నగర్‌లో కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా ఎస్సీ విభాగం కన్వీనర్ ఎస్.శివశంకర్, నాయకులు చిన్నసంతు, పి.నర్సింగ్ రావు, గంటా మల్లేష్, బాలేశ్వర్, రామచందర్, వినయ్, శంకర్, నరేష్, యశ్వంత్ కేక్ కట్ చేశారు.



నవీన్ యాదవ్‌కు శ్రీకృష్ణుడి ఫొటోను అందజేస్తున్న పీవీ రవిశేఖర్‌రెడ్డి



బోరబండ సైట్-4,5లో కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ ఎం.డి.బాబా ఫసియుద్దీన్

దుశ్శల ఏకపాత్రాభినయం రేపు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ అలేఖ్య పుంజాల

రవీంద్రభారతి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహాభారతంలో వంద మంది కౌరవులకు చెల్లెలు అయిన దుశ్శల జీవితంలోని కొత్త కోణాన్ని ఏకపాత్రాభినయం రూపంలో తాను ప్రదర్శిస్తున్నట్లు తెలంగాణ సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు ప్రొఫెసర్ డాక్టర్ అలేఖ్య పుంజాల తెలిపారు. ఇప్పటి వరకు హావభావాలు, శిల్ప భంగిమలతో నృత్యం చేసిన తాను ఇప్పుడు వాచకంతో ప్రయోగాత్మకంగా ప్రదర్శనకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. సోమవారం కళాభవన్‌లోని తన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో పోస్టర్‌ను ఆమె విడుదల చేశారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, త్రిష్ణ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ, సూత్రధార్ సంస్థల ఆధ్వర్యంలో ఈనెల 19న సాయంత్రం 7 గంటలకు రవీంద్రభారతిలో దుశ్శల మోనోలాగ్ ప్రదర్శన ఇస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ నటదర్శక ప్రయోక్త, బాలీవుడ్ నటుడు వినయ్‌వర్మ దర్శకత్వంలో 80 నిముషాల నాన్‌స్టాప్ దుశ్శల ఏకపాత్రను ప్రదర్శించనున్నట్లు చెప్పారు. అనాదిగా స్త్రీ వివక్షకు గురవుతూనే ఉన్నదనే విషయాన్ని దుశ్శలకు జరిగిన అన్యాయం, ఆమె మనోవేదనను ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. తల్లి గాంధారి దృష్టిలో తాను ఉన్నాననే విషయమే తెలియకుండా నిర్లక్ష్యంగా పెంపకం సాగిందని, తనకంటూ గుర్తింపు లేకుండా పోయిందని, సింధు రాజు సైంధవుడితో వివాహం, కుమారుడు సురధుడికి యుద్ధం వల్ల జరిగే నష్టాన్ని వివరించడం, ద్రౌపదికి లభించిన ప్రాధాన్యత తనకు దక్కకపోవడం ఇలా మహాభారతంలోని వివిధ ఘట్టాల ద్వారా దుశ్శల బంధాన్ని, అనుబంధాన్ని, ఆవేదనను వివరించే ప్రయత్నమే ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశమని అలేఖ్య తెలిపారు. తన నాట్య జీవితంలో ఈ ఏకపాత్రను ఛాలెంజ్‌గా తీసుకుని చేస్తున్నట్లు చెప్పారు. బుక్ మై షో ద్వారా ఎంట్రీ టికెట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.



అన్నప్రసాద వితరణలో అయ్యప్పస్వాములు, భక్తులు

అయ్యప్పలకు అన్నప్రసాదం

యూసుఫ్‌గూడ/బంజారాహిల్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో అయ్యప్పస్వాములకు, భక్తులకు బీజేపీ సీనియర్ నాయకుడు బడుగు సతీష్ సోమవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు రామాంజనేయులు, విజయ్, బీజేపీ నాయకులు బరిగెల జ్ఞానేశ్వర్, పులి రామ్మోహన్ పాల్గొన్నారు.

తెలుగు భాషా సేవకుడు బ్రౌన్

చిక్కడపల్లి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాషా సేవకుడు సీపీ బ్రౌన్ అని వక్తలు పేర్కొన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం సీపీ బ్రౌన్ జయంతి సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన జరిగింది. జస్టిస్ నాగమారుతిశర్మ మాట్లాడుతూ తెలుగు భాషపై విశేష అధ్యయనం చేసిన బ్రౌన్ భాషా నిఘంటువును అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. వేమన పద్య రచనలు గ్రంథరూపంలో వెలుగులోకి తెచ్చిన మహనీయుడు బ్రౌన్ అన్నారు. గానసభ పాలకమండలి సభ్యులు చక్రపాణి, గీతాదేవి పాల్గొన్నారు.

ఆర్థిక, మానసిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

బంజారాహిల్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, మానసిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఏపీ కోనసీమకు చెందిన పొత్తబత్తుల జానకీరామరాజు జూబ్లీహిల్స్ రోడ్డునెంబర్. 10సిలో ఫెస్టీ వేగ్ బోటిక్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. బోటిక్‌లోనే ఓ గదిలో ఉంటున్నాడు. కొంతకాలంగా ఓ అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదుగానీ మానసికంగా కుంగిపోయాడు. దీంతో పాటు ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. సోమవారం ఉదయం ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నకిలీ వైద్యుడి అరెస్ట్

బంజారాహిల్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నకిలీ వైద్యుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణానగర్‌లోని ఆశాహెల్త్ క్లీనిక్ పేరిట మహ్మద్ ఇర్షాద్ కొంతకాలంగా వైద్యం చేస్తున్నాడు. ఎంబీబీఎస్ పట్టా లేకుండా వైద్యం చేస్తున్నట్టు సమాచారం అందడంతో జూబ్లీహిల్స్ ఎస్ఐ జగదీష్ తన సిబ్బందితో తనిఖీ చేశారు. ఎంబీబీఎస్ పట్టా లేదని తేలడంతో అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహం చేసుకుంటానని మోసం.. కేసు నమోదు

బంజారాహిల్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన యువకుడిపై కేసు నమోదైంది. నగరానికి చెందిన ఓ యువతికి కొన్నిరోజుల క్రితం మహేష్ పరిచయ మయ్యాడు. ఇద్దరు తరుచూ కలిసేవారు. పెళ్లి చేసుకుంటానని మహేష్ నమ్మించాడు. అనంతరం శారీరక సంబంధం పెట్టుకున్నాడు. ఇటీవల యువతి వివాహం చేసుకోవాలని అడగగా, ముఖం చాటేశాడు. బాధితురాలు ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్రవాహనం మాయం

బంజారాహిల్స్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): హాస్టల్ ముందు పెట్టిన ద్విచక్ర వాహనం కనిపించకుండా పోయింది. నగరానికి చెందిన నూనె వంశీ షేక్‌పేటలోని సన్నీరెడ్డి బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈనెల 15న బయటకు వెళ్లి తిరిగి హాస్టల్‌కు వచ్చి తన ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్‌లో పెట్టాడు. మరుసటి రోజు నిద్రలేచి చూసేసరికి వాహనం కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జల్సాల కోసం రైళ్లలో చోరీలు

● నిందితులను అరెస్ట్ చేసిన జీఆర్‌పీ పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్‌పీ పోలీసులు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): సులువుగా డబ్బు సంపాదించేందుకు రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను సికింద్రాబాద్ జీఆర్‌పీ పోలీసులు పట్టుకున్నారు. ఇదే కేసులో రెండు రోజుల క్రితం మరో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావీద్ తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్ర ధారగావ్ కోపర్‌గావ్ ప్రాంతానికి చెందిన అర్జున్ కనిఫ్‌నాథ్ బోస్లే(25), భరత్ వామన్ గంగుర్దే(23), సంతోష్ శాంతారామ్(38) సులువుగా డబ్బు సంపాదించేందుకు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల నుంచి లగేజీ, నగల కోసం రైళ్లలో చోరీలకు పాల్పడుతుండేవారు. 12న నారాయణాద్రి, గోదావరి ఎక్స్‌ప్రెస్‌లలో ఓ ప్రయాణికుడి బ్యాగ్ తస్కరించారు. చోరీ సొత్తును మహారాష్ట్రలోని బాలు దహాడే అనే వ్యక్తికి విక్రయించేవారు. సోమవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఇద్దరూ అనుమానాస్పదంగా కనిపించడంతో సికింద్రాబాద్ జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ పోలీసులు పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. ఇదే కేసులో సంతోష్ శాంతారామ్‌ను 17న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. రెండు కేసుల్లో నిందితుల నుంచి 70 గ్రాముల బంగారు ఆభరణాలను రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మరో కేసులో..

సులువుగా డబ్బు సంపాదించేందుకు అసోంకు చెందిన మెహ్మద్ సనిదుల్ ఇస్లాం(25) 6న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్ ఫాం నెంబర్.1లో నగదు, బంగారం, మొబైల్ ఫోన్, అలాగే 5న ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ సమీపంలో డెల్టా ఎక్స్‌ప్రెస్‌లో నగలను దొంగతనం చేశాడు. సోమవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి రూ. 2.93 లక్షల విలువ చేసే 29 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

మహాకాళి ఆలయంలో పూజలు



అమ్మవారి మూలవిరాట్

సికింద్రాబాద్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా సికింద్రాబాద్ ఉజ్జయినీ మహాకాళి ఆలయం సోమవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ఆవరణలోని శ్రీమహాకాళేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారికి, స్వామి వార్లకు భక్తులు పూజలు జరిపి, మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక దీపాలు వెలిగించి, భక్తి శ్రద్ధలు చాటుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణాధికారి గుత్తా మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు.



వట్టేపల్లి కోటేశ్వరరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, కరస్పాండెంట్స్

వట్టేపల్లి కోటేశ్వరరెడ్డి 12వ వర్ధంతి వేడుకలు

బౌద్ధనగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): నిరుపేద విద్యార్థులను గుర్తించి వారికి ఉచిత విద్యను అందించి ఉన్నత స్థానాలకు తీసుకువెళ్లిన విద్యా ప్రదాత, అమరావతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకులు వట్టేపల్లి కోటేశ్వరరెడ్డి 12వ వర్ధంతి వేడుకలు సోమవారం సీతాఫల్‌మండి చౌరస్తాలో జరిగాయి. విద్యార్థులు, పూర్వవిద్యార్థులు ఉపాధ్యాయులు, కరస్పాండెంట్స్ తదితరులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కోటేశ్వరరెడ్డి విద్యను వ్యాపారంగా చూడకుండా కొన్ని వేలమందికి పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించారన్నారు. ఆయన వద్ద విద్యను నేర్చుకున్న ఎంతోమంది విద్యార్థులు ఉన్నతస్థానాలకు ఎదిగి దేశ, విదేశాల్లో స్థిరపడటం చాలా సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్స్ ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, ప్రసన్నలక్ష్మీ, కవితారెడ్డి, వీణారెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకారం



రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావును బోయినపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాగీరు ఆనంద్‌బాబు కలిశారు. మార్కెట్ అభివృద్ధికి చేపడుతున్న చర్యల గురించి వివరించారు. మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేయడానికి, మౌలిక సదుపాయాల మెరుగుకు సహకరించాలని కోరారు.

- సికింద్రాబాద్, ఆంధ్రజ్యోతి



తహసీల్దార్‌ను కలిసిన కాంగ్రెస్ నేతలు

మర్యాదపూర్వక కలయిక

అడ్డగుట్ట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : మారేడుపల్లి రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన మహ్మద్ అసదుల్లా ఖాన్‌ను సోమవారం అడ్డగుట్ట డివిజన్ కాంగ్రెస్ నేతలు, డీసీసీ జిల్లా చైర్మన్ గంటరాజుసాగర్ ఆధ్వర్యంలో నేతలు జాఫర్, కొమురయ్య, అంజయ్య యాదవ్, నాగభూషణం, చంద్రకళ, గోక రమేష్ నిస్సార్ రవి, అశ్విన్‌లు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

బిల్డర్స్ అసోసియేషన్ కమిటీ నియామకం



శ్యాంసుందర్, అధ్యక్షుడు

బౌద్ధనగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ బిల్డర్స్ అసోసియేషన్ నూతన కమిటీ నియామకమైంది. సోమవారం బౌద్ధనగర్ కార్యాలయంలో నిర్వహించిన బిల్డర్స్ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అడ్వైజర్‌గా కుంచాల ఏడుకొండలు, చైర్మన్‌గా నోముల ప్రకాశరావు, అధ్యక్షుడిగా మద్దెర్ల శ్యాంసుందర్, ఉపాధ్యక్షులుగా యాదగిరి, బాబు, ప్రధాన కార్యదర్శిగా మహదేవన్ రవి, కన్వీనర్ ఓం ప్రకాశ్‌చారి, కో-కన్వీనర్ సుధాకర్, కార్యదర్శులుగా విజయ్, వెంకటస్వామి, భోనగిరి శ్రీనివాస్‌గౌడ్, కోశాధికారిగా అంబాల రాజేశ్వరరావుతో ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఎన్నుకున్నారు. సికింద్రాబాద్‌లో బిల్డర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లతామని, బిల్డర్లు సమస్యలపై పోరాడతామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

జాతీయస్థాయి అథ్లెట్స్‌కు అభినయశ్రీ



జింఖానా మైదానంలో జరిగిన అథ్లెట్స్ పోటీలో ఎంపికైన అభినయశ్రీ

అడ్డగుట్ట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ఈ నెల 14, 15, 16 మూడు రోజుల పాటు జరిగిన 69వ అథ్లెట్స్ స్టేట్ లెవెల్ రన్నింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొన్న అభినయశ్రీ ఎంపికైనట్లు కోచ్ తిరుమలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ నుంచి అభినయశ్రీ (అండర్- 14 బాలికలు) 200 మీటర్స్ రన్నింగ్‌లో జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. డిసెంబరు 1 నుంచి 4 వరకు మధ్యప్రదేశ్‌లో ఇండోర్ మైదానంలో జరిగే పోటీలో పాల్గొంటుందని తెలిపారు.





రిసాలాబజార్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన వ్యాపార సముదాయాలు



యథేచ్ఛగా వెలసిన దుకాణాలు!

- రిసాల బజార్ చౌరస్తాలో అనుమతి లేని వ్యాపార సముదాయాలు
- పట్టించుకోని అధికారులు
- నాలా కబ్జా చేసి స్లాబ్ ఏర్పాటు



తిరుమలగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రైవేటు స్థలాల్లో అనుమతి లేకుండా వ్యాపార సముదాయాలు ఏర్పాటు చేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రైవేటు వ్యక్తులు తమ స్థలాల్లో వ్యాపారాలు నిర్వహించుకోవాలంటే తప్పనిసరిగా కంటోన్మెంట్ అధికారులను సంప్రదించి అనుమతి తీసుకోవాలి. కానీ అలా కాకుండా దుకాణాలను ఏర్పాటుచేసి లక్షలాది రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడి దుకాణాలకు వచ్చేవారు వాహనాలను రోడ్డు మీద పార్కింగ్ చేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. అక్కడనే రెండు ఆర్టీసీ బస్‌స్టాపులు కూడా ఉండడంతో బస్టాపుల్లో నిలవడానికి కూడా అవకాశం లేకుండా ఉంటోంది. దుకాణాలను తొలగించాలని ఎన్నో ఏళ్లుగా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదని ఒకింత అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. కొందరు వ్యక్తులు దర్జాగా పెద్ద నాలాను ఆక్రమించుకుని దానిపై స్లాబ్ వేసి యథేచ్ఛగా దుకాణాలను నిర్వహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అసాంఘిక శక్తులకు అడ్డా

వ్యాపార సముదాయాల వెనుక వైపున నిర్మానుష్య ప్రాంతం ఉండడంతో గంజాయి బ్యాచ్ రాత్రిపూట అక్కడికి చేరుకుని నానా బీభత్సం సృష్టిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు లేనిపక్షంలో ఆందోళనలు, ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తాం

బొల్లారం రిసాలాబజార్‌లో అనుమతులు లేకుండా వెలసిన వ్యాపార సముదాయాల పట్ల చర్యలు చేపడతాం. అదేవిధంగా నాలా మీద స్లాబ్ వేసి చేపట్టిన షాపు నిర్మాణాన్ని తొలగిస్తాం. దీంతో పాటు ప్రజల రవాణాలకు అడ్డుగా ఉన్నవాటిని తొలగించడానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రజలకు ఆటంకం కలిగేలా ఉన్న వాటిని త్వరలో తొలిగిస్తాం.

- ఉమాశంకర్, కంటోన్మెంట్ ఇంజనీర్

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు చేయూత



పరీక్ష ఫీజును ప్రధానోపాధ్యాయులకు అందిస్తున్న బీజేపీ నాయకురాలు కరుణశ్రీ

మచ్చబొల్లారం, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): అల్వాల్ సర్కిల్ మచ్చబొల్లారం ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజుకు అవసరమైన ఐదు వేల రూపాయలు సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులకు బీజేపీ నాయకురాలు కె కరుణశ్రీ అందించారు. కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను అనుసరిస్తూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం తన వంతు సహాయంగా ఫీజు చెల్లించానని కరుణశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా ఆర్థికంగా వెనుక బడిన విద్యార్థుల చదువుల కోసం తన శక్తి మేరకు సహాయం చేయడంలో ముందుంటానని వారు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మచ్చబొల్లారం డివిజన్ అధ్యక్షులు అజయ్ రెడ్డి, మాచర్ల శ్రీనివాస్ ,ఉదయ్ ప్రకాష్, యుగంధర్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్ అభివృద్ధికి ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే



మీడియాతో మాట్లాడుతున్న శ్రీగణేశ్

సికింద్రాబాద్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ అభివృద్ధికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని సికింద్రాబాద్ కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేశ్ తెలిపారు. సోమవారం కంటోన్మెంట్ ముఖ్యకార్యనిర్వహణాధికారి అర్వింద్‌కుమార్ ద్వివేదీతో ఆయన సమావేశమై కేంద్రం నుంచి రావాల్సిన సర్వీసు చార్జీల బకాయిలు త్వరగా వచ్చేలా చూడాలని, రామన్నకుంట చెరువు అభివృద్ధి, సుందరీకరణ చేయడానికి బోర్డు నుంచి త్వరగా ఎన్‌ఓసీ ఇవ్వాలని కోరారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం నుంచి వైద్య, ఆరోగ్యశాఖ ద్వారా మంజూరైన రూ.6 కోట్లతో 4 యూపీహెచ్‌సీల నిర్మాణం కోసం స్థలం కేటాయించాలని కోరారు. కంటోన్మెంట్ సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటున్నదని, కంటోన్మెంట్ బోర్డు తరఫున సహకరించాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని 8వార్డుల్లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యల గురించి కూడా విస్తృతంగా చర్చించామని, సీఈఓ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కంటోన్మెంట్ పాలకమండలి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు ముప్పిడి మధుకర్, వేణుగోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మర్చిపోయిన బ్యాగ్ తిరిగి అందజేత

ఆటోడ్రైవర్‌ను సత్కరించిన పోలీసులు



ఆటోడ్రైవర్ హరిలాల్‌ను సత్కరిస్తున్న ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తదితరులు

బౌద్ధనగర్, నవంబరు 17(ఆంధ్రజ్యోతి): నిజాయితీ చాటుకున్న ఆటోడ్రైవర్‌కు చిలకలగూడ పోలీసులు సత్కారం చేసి ప్రోత్సాహక బహుమతిని అందజేసి అభినందించారు. చిలకలగూడ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ అనుదీప్, అడ్మిన్ ఎస్సై రవి కుమార్ తెలిపిన వివరాల ప్రకారం హరిలాల్ జీవనోపాధి కోసం నగరానికి వలస వచ్చి ర్యాపిడో ఆటో నడుపుతున్నాడు. దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన జానకీరామ్ బంధువుల ఇంటికి వెళ్లేందుకు హరిలాల్ ఆటోను ర్యాపిడో యాప్ ద్వారా బుక్ చేసుకున్నారు. సోమవారం ఉదయం పదకొండు గంటల సమయంలో మెట్టుగూడలో ఆటో దిగిన జానకీరామ్ చేతిబ్యాగును ఆటోలో మర్చిపోయాడు. బ్యాగులో లక్షా యాభైవేల రూపాయల నగదు ఉంది. కొంత సమయం తర్వాత బ్యాగును మర్చిపోయిన సంగతి గుర్తించి సదరు ఆటోడ్రైవర్‌కు ఫోన్ చేశాడు. ఆటో సీటు వెనుకభాగంలో పడి ఉన్న బ్యాగును ఆటోడ్రైవర్ జాగ్రత్తగా తీసుకువచ్చి పోలీసుల సమక్షంలో యజమాని జానకీరామ్‌కు అందజేశాడు. నిజాయితీగా వ్యవహరించిన ఆటోడ్రైవర్ హరిలాల్‌కు పోలీసులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. సమాజంలో మంచి, మానవత్వం బ్రతికే ఉన్నాయని అనటానికి ఇటువంటి ఘటనలే రుజువు చేస్తాయని పోలీసులు తెలిపారు. ఇన్‌స్పెక్టర్ అనుదీప్, అడ్మిన్ ఎస్సై రవికుమార్, ఎస్సైలు రాకేష్, చంద్రయ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కాశీం

ఉచిత విద్య, వైద్యం కోసం ఉద్యమం

- ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాథమిక హక్కులైన నాణ్యమైన ఉచిత విద్య, మెరుగైన వైద్యం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తప్పనిసరి అని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం అభిప్రాయపడ్డారు. 'ప్రజల ప్రాథమిక హక్కు-ప్రభుత్వాల కనీస బాధ్యత" అంశంపై తెలంగాణ యువజన సంఘం ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీలోని న్యూ సెమినార్ హాల్‌లో సోమవారం నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఐదు దశాబ్దాల క్రితం విద్యార్థుల్లో నైపుణ్యాలు పెరిగేవని, ప్రస్తుత విద్యా విధానం ప్రయోజనాత్మకంగా లేకపోవడం ఆందోళనకరమని అన్నారు. అధ్యాపకులు కూడా కొత్త జ్ఞానం, ఆధునిక నైపుణ్యాలతో అప్డేట్ కావాల్సిన అవసరముందని పేర్కొన్నారు. ప్రయివేట్ విద్యా వ్యవస్థ పెరుగుతున్న వేళ ప్రభుత్వ విద్యను బలపరచకపోతే భవిష్యత్ తరాలకు ప్రమాదం తప్పదని హెచ్చరించారు. ఓయూకు సీఎం రేవంత్‌రెడ్డి వాగ్దానం చేసిన రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయింపుతో పాటు ఖాళీగా ఉన్న 800 పోస్టులను భర్తీ చేస్తే మరో 30 ఏళ్ల నాణ్యమైన విద్య అందించొచ్చని అభిప్రాయపడ్డారు. పేద పిల్లలు మధ్యలోనే చదువు మానాల్సి వస్తోందని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో సౌకర్యాల లోపం, ఉపాధ్యాయుల కొరత వల్ల ప్రజలు ప్రయివేట్ విద్య వైపు వెళ్తున్నారని తెలిపారు. ప్రతి బడ్జెట్‌లో విద్యకు 20 శాతం కేటాయించాలని ఎంవీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్ రెడ్డి, తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు, టీఎంసీ సభ్యులు డాక్టర్ రాజీవ్, డాక్టర్ చెరుకు సుధాకర్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ యువజన సంఘం నాయకులు దాసరి శశాంకర్, సత్యనారాయణ, యువరాణి, పుల్లూరి రాజు, విప్లవ్ కుమార్, రాజ్‌కుమార్, సురేష్ నాయక్, సందీప్, శివ, గోపీ, మహేందర్, యడ్ల భాస్కర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్

- పార్కు చేసిన బైకులపైకి దూసుకెళ్లిన కారు
- పదుల సంఖ్యలో వాహనాలు ధ్వంసం



పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితులు

అడ్డగుట్ట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : పార్కు చేసి ఉన్న బైకులపైకి మద్యం మత్తులో కారు ర్యాష్ డ్రైవింగ్ చేసి ప్రమాదానికి కారకుడైన కారు డ్రైవర్‌ను వెంటనే పట్టుకోవాలని వాహన యజమానులు సోమవారం తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వాహన బాధితులు మాట్లాడుతూ అడ్డగుట్ట చౌరస్తాలో ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో ఇళ్ల ముందు పార్కింగ్ చేసి ఉన్న బైకుల పైకి తుకారాంగేట్ నుంచి మద్యం మత్తులో కారు ర్యాష్ డ్రైవ్ చేస్తూ వచ్చిన బైకులపైకి దూసుకపోవడంతో కారు తలకిందులైంది. కారులో ప్రయాణం చేస్తున్న ఇద్దరు ముగ్గురు కారును పైకి లేపి కారులో పారిపోయారు. ఈ ప్రమాదంలో దాదాపు పదిహేను బైకులు పూర్తిగా నుజ్జునుజ్జయ్యాయి. పెద్ద శబ్దం రావడంతో బస్తీవాసులు బయటకు వచ్చేలోగా కారు కనిపించలేదు. వెంటనే సీసీ ఫుటేజీలను పరిశీలించిన స్థానికులు, బైకుల బాధితులు ఆదివారం ఉదయం తుకారాంగేట్ పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి వారు స్పందించలేదు. దీంతో సోమవారం తుకారాంగేట్ పోలీసులకు బస్తీవాసులు, బైకుల బాధితులు ప్రమాదానికి కారణమైన కారును వెంటనే పట్టుకోవాలని ఫిర్యాదు చేశారు.

విద్యార్థులకు పీస్ పోస్టర్ కాంటెస్ట్

మల్కాజిగిరి, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పీస్ పోస్టర్ కాంటెస్ట్ నిర్వహించారు. సోమవారం మల్కాజిగిరిలోని లిల్లీ మోడల్ స్కూల్‌లో నిర్వహించిన ఈ కాంటెస్టుకు విద్యార్థులు పాల్గొని శాంతి సందేశాన్ని తమ పోస్టర్ల ద్వారా అందంగా వ్యక్తపరిచారు. ముఖ్య అతిథిగా లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇన్నారెడ్డి హాజరయ్యారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఏర్వ శ్రీకాంత్‌రెడ్డి, రీజియన్ చైర్మన్ శ్రీధర్‌గౌడ్, డిస్ట్రిక్ట్ పీస్ చైర్మన్ లయన్ షేక్‌సయిద్, క్లబ్ కార్యదర్శి లయన్ నటరాజ్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



అడ్డగుట్ట, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో ఓ వ్యక్తి మృతి చెందాడు. గోపాలపురం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ కారు పార్కింగ్ వద్ద 55 ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉండగా సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదని తెలిపారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నరేష్

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గ్యార నరేష్ డిమాండ్ చేశారు. ఓయూలో ఈ నెల 25న నిర్వహించనున్న ఏఐఎస్ఎఫ్ 25వ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సోమవారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓయూ విద్యార్థులకు ఉచిత కోర్సు ఫీజు, హాస్టల్, నాణ్యమైన మెస్, లైబ్రరీ, హెల్త్ సెంటర్ సదుపాయాలు కల్పించడంతో పాటు ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. క్యాంపస్‌కు భద్రతతో పాటు భూములను రక్షించాలని, విద్యార్థి సంఘ ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓయూ కార్యదర్శి నెల్లి సత్య, జిల్లా అధ్యక్షుడు చైతన్య యాదవ్, సహాయ కార్యదర్శి ఉప్పల ఉదయ్ కుమార్, నాయకులు మధు, సుమన్, దొండి రామ్ పాల్గొన్నారు.

సీపీఐ శత వార్షికోత్సవాలను విజయవంతం చేయాలి

- మేడ్చల్ జిల్లా సీపీఐ కార్యదర్శి ఉమా మహేష్

ఏఎస్‌రావునగర్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం పోరాటాలు, త్యాగాలు చేసేది కమ్యూనిస్టులేనని సీపీఐ శత వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని మేడ్చల్ జిల్లా సీపీఐ కార్యదర్శి ఉమా మహేష్ తెలిపారు. సోమవారం కమలానగర్‌లోని నీలం రాజశేఖర్‌రెడ్డి భవన్‌లో నిర్వహించిన సీపీఐ ఉప్పల్ మండల సమితి సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజా జీవితంలో ఉండే కమ్యూనిస్టులకు నేటికి ప్రజల గుండెల్లో నిలిచిందన్నారు. డిసెంబరు 25న ఖమ్మంలో జరిగే సీపీఐ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు రామ్‌నారాయణ, దామోదర్‌రెడ్డి, ధర్మేంద్ర, టి.సత్యప్రసాద్, బషీర్‌లతో పాటు మండల సమితి సభ్యులు, ప్రజాసంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

జల్సాల కోసం రైళ్లలో చోరీలు

- నిందితులను అరెస్టు చేసిన జీఆర్‌పీ పోలీసులు



రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి చూపుతున్న జీఆర్‌పీ పోలీసులు

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, నవంబరు 17 (ఆంధ్రజ్యోతి) : సులువుగా డబ్బు సంపాదించేందుకు రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను సికింద్రాబాద్ జీఆర్‌పి పోలీసులు పట్టుకున్నారు. ఇదే కేసులో రెండు రోజుల క్రితం మరో నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావీద్ తెలిపిన వివరాలు ప్రకారం మహారాష్ట్ర ధారగావ్ కోపర్‌గావ్ ప్రాంతానికి చెందిన అర్జున్ కనిఫ్‌నాథ్ బొస్లే(25), భరత్ వామన్ గంగుర్దే(23), సంతోష్ శాంతారామ్(38) (17న అరెస్టు అయ్యాడు) సులువుగా డబ్బు సంపాదించేందుకు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల నుంచి లగేజీ, నగల కోసం రైళ్లలో చోరీలకు పాల్పడుతుండేవారని తెలిపారు. 12న నారాయణాద్రి, గోదావరి ఎక్స్‌ప్రెస్‌లలో ఓ ప్రయాణికుడి బ్యాగు తస్కరించారు. చోరీ సొత్తును మహారాష్ట్రలోని బాలు దహాడే అనే వ్యక్తికి విక్రయించేవారు. సోమవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఇద్దరూ అనుమానాస్పదస్థితిలో తిరుగుతుండగా సికింద్రాబాద్ జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ పోలీసులు పట్టుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. ఇదే కేసులో సంతోష్ శాంతారామ్‌ను 17న అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. రెండు కేసుల్లో నిందితుల నుంచి 70 గ్రాముల బంగారు ఆభరణాలు రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మరో కేసులో..

సులువుగా డబ్బు సంపాదించేందుకు అసోంకు చెందిన మెహమ్మద్ సనిదుల్ ఇస్లాం(25) 6న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్ ఫాం నంబరు-1లో నగదు, బంగారం, మొబైల్ ఫోన్, అలాగే 5న ఘట్‌కేసర్ రైల్వే స్టేషన్ సమీపంలో డెల్టా ఎక్స్‌ప్రెస్‌లో నగలను దొంగతనం చేశాడు. సోమవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సనిదుల్ ఇస్లాం అనుమానాస్పద స్థితిలో తిరుగుతుండగా జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ పోలీసులు తనిఖీల్లో భాగంగా అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి రూ 2.93 లక్షల విలువ చేసే 29 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని, అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.